క్లుప్తంగా

లైబ్రరీకి పుస్తకాల వితరణ



హన్మకొండ చౌరస్తా: జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా గ్రంథాలయానికి రూ.18 వేల విలువైన పుస్తకాలను సోమవారం అందజేశారు. జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు డీఆర్‌డీఓ శ్రీనివాస్ చేతుల మీదుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్‌కు పలు పుస్తకాలను అందించారు. గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతో దోహదపడుతాయని వారు కొనియాడారు. కార్యక్రమంలో వరంగల్ ఒలింపిక్స్ సంఘం బాధ్యుడు కందుల సృజన్‌కాంత్, గ్రంథాలయ సిబ్బంది కరుణకుమారి, సంతోష్ కుమార్, రాజేష్, పాఠకులు పాల్గొన్నారు.

సుధకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిశోధకురాలు కె.సుధకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హెచ్ ఆర్ పాలసీస్ అండ్ ప్రాక్టీసెస్ ఇన్ ఏపీఎస్ఆర్టీసీ – జోనల్ కంపారిజన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సుధకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరత్నం పర్యవేక్షణలో సుధ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బాలల హక్కులను కాపాడాలి

హన్మకొండ: బాలల హక్కులను ప్రతీఒక్కరు కాపాడాలని చైల్డ్‌లైన్ జిల్లా సభ్యుడు బెజ్జంకి ప్రభాకర్ కోరారు. హనుమకొండ బస్‌స్టేషన్‌లో చైల్డ్ లైన్ – 1098 ఆధ్వర్యంలో ప్రయాణికులకు బాలల రక్షణ, బాలల సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచారు. 18 ఏళ్లలోపు బాలబాలికలను ఆపద సమయంలో రక్షించి, వారికి సేవలు అందించడానికి జిల్లా కేంద్రంలో చైల్డ్ లైన్ –1098 ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనాథ బాలలు, తప్పిపోయి, పారిపోయి వచ్చిన బాలలు, అక్రమ రవాణాకు గురయ్యే బాలలు, రక్షణ, సంరక్షణ అవసరమున్న బాలలు కనిపిస్తే వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

సూపరింటెండెంట్‌ను అరెస్టు చేయాలి

ఎంజీఎం: గిరిజన సంఘాల నాయకులను కులంపేరుతో దూషించిన ఘటనపై ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ సభ్యుడు జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైద్యం వికటించిన మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరిన గిరిజన నాయకులను కులంపేరుతో దూషించడం బాధాకరమని వాపోయారు. సూపరింటెండెంట్ నిర్లక్ష్యం కారణంగా అనేక మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బానోతు కిషన్, బాలాజీ, సునీల్ నాయక్, ఫణి నాయక్, వెంకట్ నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో ఫ్లోరింగ్ పనులు



వరంగల్ అర్బన్: బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో సీసీ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. వర్షాకాలంలో ఆవరణంలో వర్షం నీరు నిలిచి అధ్వానంగా తయారవుతోంది. వరదనీరు గుంతల్లో చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన పనుల కోసం వారం రోజులుగా బల్దియా ప్రధాన కార్యాలయానికి వెళ్లే మధ్య గేట్‌ను మూసివేసి పనులను చేపట్టారు.

మొక్కలు నాటిన ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ఆవరణలో సిబ్బంది సోమవారం పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ షమిత, లైబ్రరీ ఇన్‌చార్జ్ డాక్టర్ సుజాత, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మహ్మద్ ముస్తాఫా, లైబ్రరీ అసిస్టెంట్లు ప్రభాకర్, తేజావత్ జువేర్, కృష్ణమాచారి, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

కాజీపేట రూరల్ : కాజీపేట ఫాతిమా బ్రిడ్జిపై ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి అదుపు తప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న అతనిని 108 సిబ్బంది చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బైక్‌పై నుంచి వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి బ్రిడ్జిపై కిందపడటంతో తలకు బలమైన గాయాలు కాగా 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకొని ప్రథమ చికిత్స చేస్తూ ఎంజీఎంకు తరలించారు. 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివకుమార్, పైలెట్ రాజాసింగ్, పోలీస్ సిబ్బందికి బాధితుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సాగుతూ.. ఆగుతూ..

- నత్తనడకన దసరా రోడ్డు నిర్మాణ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్‌లో 'స్మార్ట్‌సిటీ' పథకంలో భాగంగా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్ల తరబడి ముందుకు సాగక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో రాకపోవడం ఒక కారణమైతే.. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మరో కారణమని తెలుస్తోంది. రోడ్లు సక్రమంగా లేక ప్రయాణికులు, పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దసరా నాటికి పూర్తయ్యేనా?

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 40వ డివిజన్ పరిధిలో దసరా రోడ్డు జంక్షన్ నుంచి ఉర్సు గుట్ట వరకు రోడ్డు ఏర్పాటు చేసేందుకు 2021వ సంవత్సరంలో రూ.8 కోట్ల 40 లక్షలు మంజూరయ్యాయి. దాంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టారు. తొలుత ఉర్సు గుట్ట నుంచి బీరన్న గుడి వరకు పనులు పూర్తిచేశారు. తర్వాత కాంట్రాక్టర్‌కు బిల్లులకు డబ్బులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలుస్తోంది. దసరా నాటికి పనులు పూర్తయ్యేలా లేవని పలువురు వాపోతున్నారు.



ఉర్సుగుట్ట సమీపంలో వేసిన రోడ్డు



రోడ్డుపైకి వస్తున్న నీరు

ప్రజల ఇబ్బందులు

కరీమాబాద్‌లోని దసరా రోడ్డు జంక్షన్ నుంచి బతుకమ్మ, దసరా వేడుకలు నిర్వహించే రంగలీల మైదానం వరకు కొత్తగా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్డుకు తోడు డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో రోడ్డుపైకి నీరు చేరడంతోంది. మురుగునీరుతో దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు.



రోడ్డు పక్కనే ఉన్న గుంత

40 ఫీట్లకు కుదింపు

రోజురోజుకు వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. ముందుగా 60 ఫీట్ల రోడ్డు నిర్మించాలను కోగా వివిధ అభ్యంతరాలు, ఇతర కారణాలతో 40 ఫీట్ల వరకు కుదించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరో 5 నెలల్లో బతుకమ్మ, దసరా వేడుకలు జరుగనున్న నేపథ్యంలో పనులు తొందరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికో క్రీడామైదానం ఏర్పాటు

హసన్‌పర్తి: ప్రతి గ్రామానికో క్రీడా మైదానం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే చాలా గ్రామాల్లో మైదానాలు పూర్తయ్యాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రేనుకుంట్ల సునీత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, మణీంధర్‌నాథ్, జంగా కుమార్, అటికం రవీందర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మధురానగర్ కాలనీ అభివృద్ధికి కృషి

వరంగల్: 14వ డివిజన్ మధురానగర్‌లోని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు నిధులను మంజూరు చేయిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ హామీ ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సోమవారం కలిసి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కాలనీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం రవీందర్, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మడికొండ: మడికొండ హిల్స్‌కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ నూతన కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను 64 డివిజన్ కార్పొరేటర్ రాధికారెడ్డి ఆధ్వర్యంలో కలిసి విజ్ఞప్తి చేశారు. హిల్స్‌కాలనీ అధ్యక్షుడు గుంజ రవికుమార్, కాలనీపెద్దలు వెన్నమల్ల రమేష్, బేతి రాము, ఉపేందర్‌రావు, రాజయ్య, రవి, రాజు, రమేష్, అనిల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా



కేయూ మొదటి గేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: తెలంగాణ యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని కేయూ జేఏసీ, కుక్టా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేసినట్లుగానే తమను కూడా క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ కాంట్రాకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, బాధ్యులు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, మాదాసి కనకయ్య, సాధు రాజేష్, సతీష్, ఫిరోజ్‌పాషా, మామిడి లింగయ్య, వెంకట గోపినాథ్, అరూరి సూర్యం, నాగయ్య, శ్రీనివాస్, పుల్లా రమేష్, సునీత, మధుకర్‌రావు, రంగారెడ్డి, రాజేశ్వరి, నందన, అనిఫా, రంజిత్, రమాదేవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు, అధ్యాపకులు, తదితరులు

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వడ్డెపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అడ్మిషన్ల కరపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక పద్ధతుల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధన చేస్తున్నారని, మౌలిక వసతులతో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులే నూటికి నూరం శాతం ఉత్తీర్ణత సాధించారని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. పలు ఉపాధి కల్పన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రమౌళి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డి.పార్వతి, పరీక్షల నియంత్రణాధికారి డి.రామకృష్ణారెడ్డి, మాధవి, రజిత, లైబ్రరీ ఇన్‌చార్జ్ జగదీష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ విజయంపై హర్షం



సంబరాలు చేసుకుంటున్న లీగల్ సెల్ సభ్యులు

వరంగల్ లీగల్: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టులో సోమవారం సంబరాలు జరుపుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ వేముల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం వేముల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ నియంతృత్వ, నిరంకుశ, నిజాం తరహా పాలనకు అడ్డుకట్ట పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యులు తొంగరి జగన్‌మోహన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్, ఏఐసీసీ వైస్ ప్రెసిడెంట్ లాడే రమేష్, లీగల్ సెల్ సభ్యులు అహ్మద్, రవీందర్, విజయభాస్కర్ రెడ్డి, రవికుమార్, చిరంజీవి, అనిల్‌కుమార్, రజినీకాంత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరిని కలిసిన 'జూనియర్ లెక్చరర్లు'

హన్మకొండ: ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు హనుమకొండ కనకదుర్గకాలనీలోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్ల రాష్ట్ర జేఏసీ కోకన్వీనర్ గంగారపు రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ అయిన కాంట్రాక్టు లెక్చరర్లు కడియం శ్రీహరిని కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు మైదం నాగేశ్వర్, కే.సుభాష్ రెడ్డి, జి.స్వామి, బి.శంకర్, రాజు, వీరాంజనేయులు, వసంత, అజంత, స్వరూప, రుక్సాన, సుకన్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.



కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జేఏసీ నాయకులు, జూనియర్ లెక్చరర్లు

'నాపై నిరాధార ఆరోపణలు సరికాదు'

కాశిబుగ్గ: వెంకట్రామ సమీపంలోని దయానంద్ కాలనీలో గల కనకదుర్గామాత ఆలయ అభివృద్ధి కోసం పాటుపడుతున్న తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ అన్నారు. దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుడు తనపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. గత 20ఏళ్లుగా ఆలయ స్థలం ఆక్రమణలకు గురి కాకుండా కృషి చేస్తూ సభ్యుల సహకారంతో దసరా నవరాత్రి ఉత్సవాలు, పండుగలకు కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుడి అభివృద్ధి కోసం ట్రస్టు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరికొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి సురేష్‌కుమార్, ఆర్గనైజర్ వెంకటేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు వేణు, ప్రభాకర్, శేఖర్, శారద, రజిత, వీరలక్ష్మి, కూచన రవీందర్, రాజ్‌కుమార్, మనోజ్, శివశంకర్, దినేశ్, ప్రధాన అర్చకుడు గంప శ్రవతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మీసాల ప్రకాశ్

మార్కెట్‌లో మహా అన్నదానం

వరంగల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని శ్రీలక్ష్మీగణపతి సహిత అభయాంజనేయ స్వామి దేవాలయంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, సభ్యులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో వ్యాపారస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, రైతులు, గుమాస్తాలు, హమాలీలు, కార్మికులు పాల్గొన్నట్లు సభ్యులు తెలిపారు.



అన్నదానంలో పాల్గొన్న రైతులు, వ్యాపారస్తులు

ముళ్ల పొదల తొలగింపు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్‌లోని శ్మశాన వాటికలో ముళ్ల పొదలను సోమవారం తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగాల సరోజన, స్థానికులు రవిందర్‌రావు, విజయ్‌రావు, దేవేందర్‌రావు, మారగోని రవి తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకర్లకు అభినందనలు

హసన్‌పర్తి: ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు సాధించిన హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ విద్యార్థులను అధ్యాపకులు సోమవారం సన్మానించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కళాశాలకు చెందిన కళ్యాణ్‌రామ్, అభిలాష్, సమీర్, అక్షయ్ సౌమ్యను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, కళాశాల అభివృద్ధి కమిటీ బాధ్యుడు చకిలం రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిన హసన్‌పర్తికి చెందిన ఎల్కరాజు వర్షితను ఎమ్మెల్యే అరూరి రమేష్ సన్మానించారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకురాలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, దేవస్థాన మాజీ ధర్మకర్త కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు



వినతిపత్రం అందజేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

కరీమాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు అందజేశారు. రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డీలర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్రీవత్స కోటకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధారావత్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ రేషన్ డీలర్లకు ఇస్తున్న నామమాత్రపు కమీషన్ స్థానంలో గౌరవ వేతనంగా రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉమేందర్, గోపి, రామచంద్రం, శంకర్‌రావు, ఉపేందర్, వెంకటనారాయణ, రవి, సోమనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలు

కరీమాబాద్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు బొట్ల నరేష్, మంద నరేష్ కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్రీవత్సకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు టెక్నో, ప్రైమ్, ఐఐటీ, సివిల్ ఫౌండేషన్ వంటి తోక పేర్లతో ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. కొంత పాఠశాలల్లో రాష్ట్ర సిలబస్ బోధించి సీబీఎస్ఈ ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

అవినాష్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: ఉద్యోగ అవకాశాల పేరుతో భారీ యాడ్స్, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న అవినాష్ విద్యాసంస్థలను మూసివేసి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అవినాష్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి దాని గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, నాయకులు అజయ్‌గౌడ్, భరత్, జగన్ పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో..

బాధిత రైతులకు న్యాయం చేయాలి

కరీమాబాద్: తమ రెక్కల కష్టాన్నే నమ్ముకునే రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కిసాన్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలను ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు ట్రక్‌షీట్ ఇవ్వాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రుణాలను రీషెడ్యూల్ చేయాలని, రుణమాఫీ అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, తిరుమల్, సురేష్, ప్రవీణ్, కొండా రెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కిసాన్ కాంగ్రెస్ నాయకులు

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో ముదిరాజ్ కులసంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కాగా, పెద్దమ్మ గుడికి శాస్త్రోక్తంగా ద్వార బంధన ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు హాజరై ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లె బోయిన అశోక్, పీఏసీఎస్ సొసైటీ వైస్ చైర్‌పర్సన్ సోల్తీ భూమాతతో కలిసి పూజలు చేశారు. ముదిరాజ్ కుల మహిళలు మంగళ హారతులతో హాజరయ్యారు. కార్యక్రమంలో రజినీకాంత్, ఏఎంసీ డైరెక్టర్ తుమ్మ రవీందర్ రెడ్డి, భారత్ కత్తెరపల్లి దామోదర్, తుమ్మ కోదండరాం, ఆలయ చైర్మన్ బొజ్జం కుమారస్వామి, సుధాకర్, సోల్తీ నరేందర్, కిరణ్, భరత్ పాల్గొన్నారు.